11072024-MAI-04_Layout 1 7/11/2024 3:11 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అగ్నిపథ్ వివాదం

ఆర్థిక సరళీకరణలు ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వం ఒక్కోరంగంలో తన బరువు, బాధ్యతల నుంచి తప్పుకోవడం సాధారణ విషయమైంది. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం దగ్గరి నుంచి ఉద్యోగులకు పింఛన్ల చెల్లింపును ఉపసంహరించుకోవడం వరకూ రకరకాల రూపాల్లో ఇది వ్యక్తమవుతున్నది. చివరికి ఈ ధోరణి భారతీయ రక్షణ దళాలపైనా ప్రభావం చూపింది. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ ఇందుకు ఓ ప్రముఖ ఉదాహరణ. ఈ పథకం కింద తాత్కాలిక ప్రాతిపదికన రక్షణ దళాల సిబ్బంది నియామకం జరుగుతున్నది. అగ్నిపథ్ కింద ఎంపికయ్యే జవాన్లకు అగ్నివీర్ అనే పేరు ఖాయం చేశారు. సాధారణ సైనికులతో పోలిస్తే వీరికి లభించే జీతభత్యాలు తక్కువ స్థాయిలో ఉంటాయి. పైగా సర్వీసు నాలుగేండ్లకు పరిమితం. భర్తీచేసే అగ్నివీర్‌లలో 25 శాతం మందికి మరో పదిహేనేండ్ల పాటు సర్వీసును పొడిగిస్తారు. మిగిలిన 75 శాతం మందిని బయటకు పంపిస్తారు. వారు బయట కొత్తగా ఉద్యోగాల వేటలో పడాల్సిందే. పైగా అగ్నివీర్‌లకు పింఛన్, గ్రాట్యుటీ ఉండవు. ఏకమొత్తంగా కొంత సొమ్ము చెల్లిస్తారు. ఆర్మీ క్యాంటీన్, వైద్య సౌకర్యం వంటివి కూడా అందుబాటులో ఉండవు. మాజీ సైనికులనే హోదా, సంబంధిత ప్రయోజనాలేవీ అగ్నివీర్‌లకు ఇవ్వరు. అగ్నివీర్‌లు అమరులైనా ప్రభుత్వం తనవంతుగా ఎలాంటి పరిహారం చెల్లించదు. బీమా సొమ్ము మాత్రమే కుటుంబానికి అందుతుంది.

ప్రభుత్వం జవాబుదారీతనాన్ని పూర్తిగా తగ్గించే ఈ పథకం మొదటినుంచీ వివాదాస్పదమవుతూనే ఉన్నది. ఈ పథకాన్ని రద్దు చేయాలనే డిమాండ్లు ఇటీవలి కాలంలో అంతకంతకూ పెరుగుతున్నాయి. సియాచిన్‌లో అమరుడైన ఓ సైనికాధికారి కుటుంబసభ్యులు ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం తెలిసిందే. సైనిక సేవను ఉపాధి అవకాశంగా ఎంచుకునే యువతలో అగ్నిపథ్ తీవ్రమైన అసంతృప్తిని రాజేస్తున్నది. అత్యధిక సైనికభర్తీ జరిగే హర్యానా వంటి రాష్ర్టాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తున్నది. యూపీలో ఘోరంగా దెబ్బతినడానికి ఈ పథకం కూడా కారణమని బీజేపీ నేతలే అంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గిపోయి మెజారిటీ గీతకు దిగువన 240 వద్ద ఆగిపోవడానికి గల కారణాలపై ఆ పార్టీ జరుపుతున్న విశ్లేషణల్లో అగ్నిపథ్ కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వస్తున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా యూపీ, రాజస్థాన్ నేతలు దీన్ని పార్టీకి ప్రతికూలంగా పనిచేసిన అంశంగా ఎత్తిచూపుతున్నారు. ఉత్తరాదికి చెందిన ఎన్డీయే మిత్రపక్షాలూ అగ్నిపథ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశాయి.

2022లో అగ్నిపథ్‌ను ప్రవేశపెట్టినప్పుడు దేశవ్యాప్తంగా సైన్యంలో చేరాలనుకునే యువతలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. అనేక చోట్ల అల్లర్లు, హింసాకాండ చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం కూడా జరిగింది. అగ్నివీర్‌లు అమరులైతే చెల్లించే పరిహారం అంశం లోక్‌సభ తొలి సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చినప్పుడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అసహనానికి గురికావడం తెలిసిందే. అగ్నిపథ్ రక్షణ దళాల్లో రెండు రకాల శ్రేణులను సృష్టిస్తుంది. వీరు పొందే ప్రయోజనాల్లో అంతరం ఉంటుంది. దీర్ఘకాలికంగా ఉద్యోగార్థులకే కాకుండా దేశ భద్రతకూ ఈ తరహా విభజన అంత సానుకూలంగా ఉండకపోవచ్చుననే సందేహాలను పూర్తిగా కొట్టిపారేయలేం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండికి పోకుండా దేశ ప్రయోజనాలు, ఇటీవలి పరిణామాలను దృష్టిలో పెట్టుకుని అగ్నిపథ్‌పై పునరాలోచన జరపడం మంచిది.

దళిత వ్యతిరేకి బీజేపీ!

దక్షిణాది నుంచి ఏడుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికైన ఏకైక దళిత ఎంపీని నేనే. కానీ, నా అదృష్టాన్ని చూడండి. అగ్ర కులాలకు చెందిన వారందరూ కేంద్ర మంత్రులయ్యారు. బీజేపీకి దళితులు మద్దతివ్వలేదా? నేను తీవ్ర మనస్థాపానికి గురయ్యాను.

- రమేశ్ జిగజినగి, బీజేపీ ఎంపీ

'నా గొడవ'... అంటే మన గొడవ!

చంద్రబాబు నాయుడుతో మనకు తీరని గొడవ ఉన్నది కాబోలు! నాదేమీ కుట్ర సిద్ధాంతం కాదు! తెలంగాణ ఇపుడు జాగరూకతతో ఉండవలసిన అవసరం ఉన్నదని మరింతగా నొక్కి చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం. ముఖ్యంగా చంద్రబాబు ప్రతినిధి తెలంగాణను పాలిస్తున్నపుడు మనం మరింత అలెర్ట్‌గా ఉండాలె! కుట్ర సిద్ధాంతాలకు విరుగుడే 'నా గొడవ', అదే, కాళోజీ గొడవ!

శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి.'అన్యాయాన్ని ఎదిరించినవాడే నాకు ఆరాధ్యుడు' అని ఏ తెలంగాణ వైతాళికుడు అన్నరో, ఆయన రాసిన 'నా గొడవ'ను రేవంత్ రెడ్డి చంద్రబాబుకు బహూకరించడం ఒక వైచిత్రి. అసలు అందులో ఏమి ఉన్నదో ఇచ్చినాయనకు తెలియకపోవచ్చు; అందులో ఉన్నది తమను ఏమి చేసిందో, మరింకేమేమి చేయగలదో తీసుకున్నాయనకూ తెలియకపోవచ్చు.

తెలంగాణ వాళ్లు పొద్దున్నే లేవరని, ఎన్టీఆర్ వల్లనే వరి అన్నం తినటం నేర్చుకున్నారనటం దగ్గరి నుంచీ... అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్నే నిషేధించే దాక పోయిండు చంద్రబాబు! ఈ అహంకారానికి ఆత్మగౌరవ సమాధానమే కాళోజీ 'నా గొడవ'. అందులో ఏముందో తెల్వక రేవంత్ రెడ్డి ఏదో ఫ్యాన్సీగా ఇచ్చి ఉండొచ్చు. కానీ 'నా గొడవ' చంద్రబాబుకు సహించేది కాదు, అందులోని సత్యస్ఫూర్తి ఆయన భరించేది కాదు అన్నరు తెలంగాణ ఉద్యమకారుడు, కవి మిత్రుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్.

కాళోజీ చెప్పిన 'పాతి పెట్టాల్సిన ప్రాంతీయుడు, తరిమి కొట్టాల్సిన ప్రాంతేతరుడు' కలిసి ఈ నాటకాన్ని రక్తి కట్టించడం ఒక గడుసైన దృశ్యం! దానికి తారస్థాయి ముగింపు చంద్రబాబు నోట 'జై తెలంగాణ' మాట!

> విభజన చట్టాన్ని అడ్డు పెట్టుకొని చంద్రబాబు తెలంగాణలో రాజకీయం చేయాలని చూస్తున్నరు. ఆయన ద్వారా బీజేపీ తెలంగాణలో నాటకాలకు తెరతీసిందన్న కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి మాటలు కాంగ్రెస్ వాళ్లు గమనించాలి. కూతురుకు నిన్ననే కార్పొరేషన్ పదవి ఇప్పించుకున్న జగ్గారెడ్డి ఇప్పుడప్పుడే రేవంత్‌రెడ్డిని డైరెక్ట్‌గా ఏమీ అనడం లేదు; అట్లని అనకుండానూ లేరు. చంద్రబాబును అన్న మాటలు అన్నీ రేవంత్‌రెడ్డికే తగులుతయి. తమ ప్రభుత్వాన్ని, పార్టీని కాపాడుకుంటరో, ఈనగాచి నక్కల పాలు చేసినట్టు రేవంత్‌కు ధారపోస్తరో, తద్వారా చంద్రబాబుకు గుత్తకు ఇస్తరో కాంగ్రెస్ వాళ్లే తేల్చుకోవాలి.

సోనియా, రాహుల్‌లకు అర్థం అయితున్నదో లేదో గానీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వమూ గడ్డు కాలం ఎదుర్కొంటున్నది. ప్రభుత్వమేమో ప్రజలకు; పార్టీయేమో అసలైన కార్యకర్తలకు కాకుండా పోతున్నది. పాత కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్, ఫిరాయింపు కాంగ్రెస్‌లుగా పార్టీ విడిపోయింది. దాదాపు ప్రతీ నియోజకవర్గంలో కనీసం మూడువర్గాలున్నయి. రోజూ కొట్టుకుంటున్నయి. సాండ్ ల్యాండ్ ఫండ్ మాఫియాగా మారిపోయి పచ్చని తెలంగాణను అల్లకల్లోలం చేస్తున్నయి. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఇదే తంతు! గల్లీల్లో పరస్పర భౌతిక దాడులకు దిగుతుండగా, ఢిల్లీలో అధిష్ఠాన ఏజెంట్ల ముందు మంత్రులు సైతం ఒకరిపై ఒకరు పితూరీలు చెప్పుకుంటూ ఉన్నరు. రేవంత్‌రెడ్డి విధేయత మోదీకా, రాహుల్‌కా అన్నది ఢిల్లీ పెద్దలకు వీడని సంశయం. మరొకవైపు తెలంగాణ మేధావులు 'కాంగ్రెస్ మార్కు ప్రజాస్వామ్య వీచికలు, స్వేచ్ఛాయుత పాలన' పర్యవసానాలు ఇపుడిపుడే చవిచూస్తున్నరు. 2019 ఎన్నికల సందర్భంగా కోదండరాం జనసమితిని కూటమిలోంచి తరిమేయాలని చంద్రబాబు హుకుం జారీచేసిన విషయం రాహుల్‌కు ఒక శ్రోతలాగ మాత్రమే తర్వాత తెలిసింది. కత్తి వేటుకు నెత్తురు చుక్కలేని మోముతో రాహుల్ కూడా తలూపక తప్పని పరిస్థితి. 'కోదండరాం రాజకీయాలకు పనికిరాడు' అని మీడియా ముఖంగా పలికిన రేవంత్‌రెడ్డి అదే విషయం తన గురువు చంద్రబాబు ద్వారా రాహుల్‌కు చెప్పించిండు. అందరూ కలిసి కోదండరాంకు పొగ పెట్టిన్రు. టీజేఎస్‌ను ఆరు సీట్లకు పరిమితం చేసి, అందులో నాలుగు చోట్ల తమ రెబల్ అభ్యర్థులనూ దింపిన విలువ లేని పార్టీ కాంగ్రెస్!

ఇన్ని తెలిసినా కోదండరాం ఇంకా రేవంత్‌రెడ్డి వైపు చూస్తున్నరంటే కారణం రేవంత్ సమర్థత మీదో, తెలంగాణ అభివృద్ధి మీదో నమ్మకం కాదు, కేసీఆర్‌పై ఏదో పట్టరాని కోపం. నిజానికి చాలామంది తెలంగాణ మేధావులకు కేసీఆర్‌పై నిర్హేతుకమైన కోపమే. బీఆర్ఎస్ పాలనపై రోజూ దుమ్మెత్తి పోసి, కాంగ్రెస్ పార్టీకి బాండెడ్ లేబర్‌లా పనిచేసిన ఎంతోమంది తెలంగాణ బుద్ధిజీవులు నేడు లోపల్లోపల కుములుతున్నరు.

సింగరేణి పోరుబాట బట్టింది. నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడి తర్వాత రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడి తలపెడుతున్నరు. తమను ఈ ప్రభుత్వం ఆదుకోలేదని నిరాశా నిస్పృహలకు లోనవుతున్న రైతులు సెల్ఫీ వీడియోలు పెట్టి మరీ ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఆరు నెలల్లో 11 మంది నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడిన్రు. హాస్టళ్లలో విద్యార్థులు తరచూ విషాహారం పాలబడుతున్నరు. మంత్రులు మాట్లాడే మీటింగ్‌లలో సైతం కరెంటు పోవడం నిత్యకృత్యమైంది. విద్యార్థుల ఆకలి తీర్చే 'సీఎం బ్రేక్ ఫాస్ట్'కు మంగళం పాడిన్రు. శాంతిభద్రతలు లుప్తమై నడిరోడ్ల మీద జనం తన్నుకు చస్తున్నరు. రియల్ మాఫియాను అడ్డుకునేవారు లేరు. విద్య, హోం శాఖలు చూస్తున్న రేవంత్‌రెడ్డికి తీరికే లేదు. తుచ్ఛ రాజకీయాలకు మాత్రమే పరిమితమైతున్నరు. పల్లె-పట్టణ ప్రగతికి పైసా విదల్చక పారిశుద్ధ్యం పడకేసింది, వ్యాధులు విజృంభిస్తున్నాయి. అదానీకి విద్యుత్తు రంగాన్ని అప్పజెపుతున్నరు. ఆరు గ్యారెంటీలు అటకెక్కినయి. హక్కులు అడిగితే చెప్పుతో కొడతామంటున్నరు మంత్రులు. అది అందిపుచ్చుకొని చేతల్లో చూపిస్తున్నరు పోలీసులు!

తన పాలననే రెఫరెండంగా ఎంపీ అభ్యర్థులకు ఓటు వేయాలన్న రేవంత్ పిలుపునకు ప్రజలు సరిగానే స్పందించిన్రు. 'రేవంత్‌ది పూర్ పర్ఫార్మెన్స్' అంటూ కాంగ్రెస్ అధిష్ఠానం త్రిసభ్య కమిటీని విచారణకు పంపిందంటే రేవంత్ పాలన పట్ల ప్రజా వ్యతిరేకత ఎంత ఉందనేది స్పష్టమవుతున్నది. ధర్నాలతో దద్దరిల్లుతున్నది తెలంగాణ. ఒక్క ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ దృష్టిలో తప్ప పాలన అంతా అస్తవ్యస్తంగా ఉన్నది. ఆరు నెలల్లో 38 వేల కోట్లు అప్పు తెచ్చిన రేవంత్ ప్రభుత్వం అవి ఎక్కడ ఖర్చు పెట్టిందో దేవునికే ఎరుక. రైతుబంధు పడ లేదు, షాదీ ముబారక్ చెక్కులు బౌన్స్ అవుతున్నయి. వరికి మద్దతు ధర లేదు గానీ బీఆర్ఎస్ నుంచి వచ్చే వారికి మద్దతు ధర మాత్రం ఇస్తున్నట్టున్నరు!

నయానో భయానో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకోవడం తప్ప రేవంత్ మరో పని చేయడం లేదు. పార్టీలు మారుతున్న ప్రజా ప్రతినిధులు ఒక్కసారి ఆలోచించుకోవాలి. పైన చెప్పిన దారుణ దుర్మార్గాలన్నీ మీ కండ్ల ముందే ఉన్నయి. మీ మీ నియోజకవర్గ ప్రజలను ఎవరిని కదిపినా చెప్తరు రోజులెంత దుర్భరంగా ఉన్నయో, కేసీఆర్ పాలనను ఎంత మిస్ అవుతున్నమో అని. మరి మీరు పార్టీ మారేది ఏమి సాధించడానికి? రేపు మళ్లీ గెలువగలరా? ప్రజాగ్రహం ముందు నిలువగలరా! నిరుద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఏమి చేయాలో తెలియక, ఏమని సర్దిచెప్పాలో పాలుపోక కోదండరాం, ఆకునూరి మురళి, బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్నలు మొహం చాటేసిన్రు. కోదండరాం ఇంటి ముట్టడికి విద్యార్థులు సిద్ధమైతున్నరు. మరి మీరు పార్టీలు మారి ఏమి పీకుతరని ప్రజలు అడుగుతున్నరు ఊళ్లల్లో. రేపు రాళ్లతో కొడతరు, తయారుగా ఉండండి!

> ఆడలేక పాత గజ్జెలు అన్నట్టు ఇప్పటికీ గత ప్రభుత్వం మీద పడి ఏడుస్తున్న రేవంత్ రెడ్డి, మొన్న తన గురువు ఏమన్నరో గ్రహించాలి. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉన్నది. గుజరాత్, కర్ణాటకలను కూడా దాటేసింది అన్నరు చంద్రబాబు. రాహుల్ గాంధీయేమో తెలంగాణ మాడల్ దేశమంతా కావాలి అంటే, రేవంత్ రెడ్డి గుజరాత్ మాడల్ కావాలంటున్నరు. చంద్రబాబు గుజరాత్ కంటే తెలంగాణ బాగుంది అంటున్నరు. రేవంత్ రెడ్డి చంద్రబాబుకు, వైఎస్‌కు సమాన దగ్గరలో ఉంటున్నరు. 'వైఎస్ ఆశీస్సులు రేవంత్‌కు ఉంటయి' అన్నరు ఉండవల్లి అరుణ్ కుమార్. అటు చంద్రబాబు, ఇటు వైఎస్ ఆశీస్సుల బలంతో రేవంత్ తెలంగాణను ఏ గతి పట్టించగలడో మన ఊహకు అందుతున్నదా?

'వైఎస్ ఒక దార్శనికుడు. ఆయన హయాంలో ఉమ్మడి ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. కూటమి ప్రభుత్వంపై కొట్లాడేది షర్మిలయే. 2029లో ఏపీలో కాంగ్రెస్‌దే అధికారం, షర్మిల సీఎం'... అన్నరు రేవంత్ మొన్న ఏపీలో వైఎస్‌కు నివాళి ఘటిస్తూ! అంతకుమునుపు ఇదే మనిషి చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సాధించిన విజయాలు ఏకరువు పెట్టిండు; జలవనరుల నిర్వహణలో ఆయనే ఆదర్శమన్నడు!

ఒక మనిషికి ఎన్ని ముఖాలని ఉంటయి? ఎంత థర్డ్ క్లాస్ రాజకీయమైనా ఇంత దిగజారాలా? బాబును దింపి, షర్మిలను సీఎం చేయాలన్న రేవంత్ మాటలను ఆంధ్రజ్యోతి, టీవీ 5, మహా టీవీ, ఈటీవీ, చంద్రబాబు, తుమ్మల, వెంకయ్యానాయుడు తదితరులు ఒప్పుతరా? అసలు విషయం ఏమంటే, ఏపీ కాంగ్రెస్‌నూ, షర్మిలనూ ఫూల్ చేసి వచ్చిండు రేవంత్. రాజకీయ నాయకులు సమయానికి తగ్గట్టు మాట్లాడటం సహజం. కానీ, ఇంత బరితెగింపు, ఇంత నైచ్యం, ఇంత విశ్వాసరాహిత్యం ఒక్క రేవంత్‌కే సాధ్యం! చైతన్యవంతమైన తెలంగాణకు రేవంత్ ఒక అవమానం! పాపం ఏపీలో కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ తమవాడో కాదో డౌట్. ఇపుడు తెలంగాణ కాంగ్రెస్ వాళ్లకు కూడా అదే సందేహం. ఆయనతో మనసులేని కాపురం చేస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి నా సానుభూతి. మీ చావుకు మీరే తోరణం, మీ కర్మకు మీరే కారణం!

ఎవరి చావు ఎవరన్నా చావనీ; ఏ పార్టీలు ఎటన్నా పోనీ... అందరూ కలిసి తెలంగాణను ఆగం చేస్తున్నరన్నదే కదా మనందరి బాధ! ఇంత క్షుద్ర రాజకీయాలు మనం ఎరుగుదుమా? పదేండ్లలో అభివృద్ధి-సంక్షేమం-ఆత్మగౌరవం తప్ప తెలంగాణను కబళించే శక్తుల ఆటలు సాగినయా? వైఎస్ లేదా చంద్రబాబుల స్ఫూర్తిని కలవరించే పాలకుడు వస్తడని ఊహించినమా?

> ఈ వ్యాసం రాస్తున్న సమయంలోనే వచ్చిందొక ఫోన్, ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నుంచి. జగన్ చేసిన సంక్షేమం చంద్రబాబు ఇప్పటిదాకా చేయలేదని, ఇక ముందూ చేయబోరని. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏటా కనీసం లక్ష రూపాయలు ఏదో ఒక రూపంలో అందినాయని. స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత జగన్ ఓటమికి దారి తీసిందని ఆ మాటల సారాంశం. అచ్చు తెలంగాణలో జరిగినట్టే అక్కడా జరిగినట్టు అనిపిస్తున్నది.

తెలంగాణలో కూడా క్షేత్రస్థాయి నాయకులు సరిగ్గా లేక, అధినాయకుని దార్శనికతను అందుకోలేక, తాము బొక్కబోర్లా పడి, పార్టీని ముంచి... ఇపుడు అంగలారిస్తే ఏమి లాభం? పోనీ గెలిచినవారన్నా పరిణామాలు మొత్తంగా అర్థం చేసుకోక, మంచిరోజులు వస్తాయనే ఆశా, ఓపికా లేక పక్కచూపులు చూస్తున్నరే... రేపు కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ చేతిలో చిత్తు చిత్తు అవబోతున్నది కదా, అపుడేమి చేస్తరు? పైన చెప్పినట్టు ప్రజలు నానా కష్టాలు పడుతూ ఉంటే, ప్రభుత్వంపై ఆగ్రహోదగ్రులు అవుతూ ఉంటే వారి పక్షాన కొట్లాడే బాధ్యత మరిచి ఫిరాయింపులకు పాల్పడటం ప్రజా ద్రోహం. కేసీఆర్‌కు పోయేదేమీ లేదు... ఇంట్లో కూచున్నా అధికారంలోకి వస్తరు, అంతలా ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. నష్టపోయేది మీరు. మీ ఇష్టమిక.

ప్రియ ప్రజలారా!...
ముప్పేట దాడితో వలసవాదులు మనమీదికి వస్తున్నప్పుడు, సమైక్య పాలనలోని కష్టాలు మళ్లీ మన అనుభవంలోకి వస్తున్నపుడు కాళోజీ ఆత్మగౌరవ ప్రకటన అయిన 'నా గొడవ'ను మననం చేసుకోవలసిందే. ఒక పీడకుని చేతిలో మరొక పీడకుడు పెట్టిన మన అస్తిత్వాన్ని గుంజుకోవలసిందే.

జై తెలంగాణ!

ప్రజాపాలనలో నిర్బంధాలా?

అనంతుల మధు
95058 66698

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ డిక్లరేషన్ పేరిట విద్యార్థి, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను గుప్పించింది. కానీ, తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. జీవో నంబర్ 46 రద్దుపై కుంటిసాకులు చెప్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాటవేత ధోరణిని అవలంబిస్తుండగా.. గ్రూప్ 1లో 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులకు అవకాశం కల్పించటంపై డిప్యూటీ సీఎం భట్టి అసలు నోరు మెదపటం లేదు. అంతేకాకుండా, ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లోనే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని నాడు మాటిచ్చి.. అధికారంలోకి వచ్చి 7 నెలలవుతున్నా మెగా డీఎస్సీపై స్పందించడం లేదు. జాబ్ క్యాలెండర్ హామీని అటకెక్కించారు. నిరుద్యోగ భృతిపై మాటమార్చారు.

18 ఏండ్లు పైబడిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీ, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, బాసర ట్రిపుల్ ఐటీ తరహాలో మరో నాలుగు విద్యాసంస్థల ఏర్పాటు, విద్యార్థులకు ఫ్రీ వైఫై సౌకర్యం, ప్రతి మండలానికి అంతర్జాతీయ స్థాయి స్కూల్ ఏర్పాటు హామీలన్నీ గాల్లో కలిసిపోయాయి.

ప్రజాపాలన అంటూనే హామీల అమలు కోసం దీక్షలు చేస్తున్నవారిని నిర్బంధిస్తుండటం సిగ్గుచేటు. విద్యార్థి నాయకుడు మోతీలాల్ నాయక్ తొమ్మిది రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కానీ, కాంగ్రెస్ అనుబంధ కుహనా మేధావులు గానీ కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. జూలై 5న నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలు విద్యార్థి సంఘాలు టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తే.. ప్రజల హక్కులను రక్షిస్తామని చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వమే నిరసన తెలియజేయకుండా ప్రజల హక్కును కాలరాసింది. తెలంగాణ యువత సమస్య రాజకీయ నాయకుల నిరుద్యోగ సమస్యను తీర్చుతున్నదే కానీ, తమ సమస్యను మాత్రం తీర్చడం లేదు. ఈ విషయం మరోసారి తేటతెల్లమైంది.

కొంతమంది కుహనా మేధావులు తమ స్వప్రయోజనాల కోసం పాకులాడుతూ నిరుద్యోగులను వాడుకుంటున్నారని మరోసారి నిరూపితమైంది. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో వారు యువతను పట్టించుకున్న పాపానపోలేదు. ఈ విషయాన్ని యువత గ్రహించి పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరు సలిపినప్పుడే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయి.



ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ప్రభుత్వాలకు దిక్సూచిగా ఉంటూ, పాలకులకు దిశానిర్దేశం చేసేది రాజ్యాంగం. ఎంతో మహోన్నతమైన రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత నాయకులపై ఉన్నది. గతంలో ఎంతోమంది నేతలు రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఆదర్శంగా నిలిచారు కూడా. కానీ, ఇప్పటి నేతలు మాత్రం అందుకు భిన్నం. రాజ్యాంగాన్ని కాపాడాల్సిందిపోయి వారే స్వయంగా విలువలకు తిలోదకాలిస్తూ.. రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసేందుకు యత్నిస్తున్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఒక చేత్తో రాజ్యాంగాన్ని పట్టుకొని, మరో చేత్తో దాని విలువలను కాలరాస్తున్న తీరే అందుకు నిదర్శనం. పార్టీ ఫిరాయించిన వారిపై వెంటనే వేటు వేసేలా రాజ్యాంగాన్ని సవరిస్తామని న్యాయ్‌పత్ర పేరిట ఓ వైపు హామీ ఇస్తూనే.. మరో వైపు ఇతర పార్టీల నేతలకు కండువాలు కప్పి ఫిరాయింపులను ప్రోత్సహిస్తుండటం శోచనీయం. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నవారే.. రాజ్యాంగాన్ని రక్షిస్తామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం.

రాహుల్.. ఇదేనా రాజ్యాంగ రక్షణ!

పిన్నింటి విజయ్ కుమార్
90520 39109

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫిరాయింపులకు తాము వ్యతిరేకమని అంటూనే రాష్ట్రాల్లో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నది. గతంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టిన చరిత్ర ఆ పార్టీ ది. అనైతికంగా పార్టీలను చీల్చుతూ పొత్తులతో ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తున్న మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నది. ఈ విధంగా రెండు జాతీయ పార్టీలూ రాజ్యాంగం విలువలకు తిలోదకాలిస్తున్నాయి.

పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా కేంద్రం లో కాంగ్రెస్ అగ్రనాయకత్వం రాజ్యాంగాన్ని చేతబూని పోరాటం చేస్తుండగా.. తెలంగాణ రాష్ట్ర నాయకత్వం మాత్రం అందుకు విరుద్ధంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పార్టీలో చేర్చుకుని రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్నది. 1985లో రాజీవ్‌గాంధీ సర్కార్ తీసుకొచ్చిన ఫిరాయింపుల చట్టానికి తూట్లు పొడుస్తున్నది. అయితే ఈ ఫిరాయింపులు ఇప్పటికిప్పుడు పురుడుపోసుకున్నవి కావు. రాజ్యాంగాన్ని తీసుకొచ్చిన నాటి నుంచి నేటి వరకు అవి కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు 1985లో చట్టం తీసుకురాగా, 2003లో దానికి సవరణలు జరిగాయి. అయినప్పటికీ ఈ చట్టాన్ని తమ చుట్టంగా భావిస్తూ, అందులోని లొసుగులను ఆసరాగా చేసుకుని అధికారం ఎక్కడుంటే అక్కడ నేతలు వాలిపోతున్నారు.

> రాజకీయ వ్యవస్థను ఫిరాయింపులు జలగల్లా పీడిస్తున్నప్పటికీ పలు సంఘటనలు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించే పలువురు స్పీకర్లు పార్టీ ఫిరాయించిన వారిపై వేటు వేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతున్నారు. 2017లో రాజ్యసభ సభ్యులు శరత్ యాదవ్, అన్వర్ అలీ పార్టీ ఫిరాయించగా అప్పటి రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు మూడు నెలల్లోనే వారి సభ్యత్వాన్ని రద్దు చేశారు. అయితే కొంతమంది సభాపతులు, సభాధ్యక్షులు మాత్రం చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకుని ఫిరాయింపులను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు.

పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేకపోవటంతో గతంలో పలు పార్టీలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ఆయా కేసులపై పలు కోర్టులు తీర్పులు వెలువరించాయి. ఈ సందర్భంగా ఫిరాయింపులపై న్యాయస్థానాలు వెలువరించిన తీర్పుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

కిహోట హాల్లోహాన్ వర్సెస్ జాచిల్హూ కేసు (1993): ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం సభ్యులపై అనర్హత వేటు వేయడంలో స్పీకర్‌దే తుదినిర్ణయం కాదని ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పేర్కొన్నది. స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని, సభాధ్యక్షుల నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేయడం రాజ్యాంగబద్ధమేనని చెప్పింది.

జి.విశ్వనాథన్ వర్సెస్ తమిళనాడు శాసనసభ స్పీకర్ (1996): చట్టసభ సభ్యుడు బహిష్కరణకు గురైనప్పుడు అతడిని ఆ సభకు చెందని వ్యక్తిగా పరిగణించాలని ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం తెలిపింది. అదే సమయంలో అతడు పాత రాజకీయ పార్టీ సభ్యుడిగానే కొనసాగుతాడని చెప్పింది. ఒకవేళ అతడు వేరే పార్టీలో చేరితే తన పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టు పరిగణించాలని, కాబట్టి ఆ సందర్భంలో ఆ సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించవచ్చని పేర్కొన్నది.

కులదీప్ నాయర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2006): రాజ్యసభ ఎన్నికల్లో రాష్ట్ర శాసన సభ్యుడు తన పార్టీ ఆదేశాలకు భిన్నంగా ఓటు వేస్తే 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత వర్తించదని, రాష్ట్ర శాసనమండలి సభ్యుల ఎన్నిక విషయంలో మాత్రం అనర్హత వర్తిస్తుందని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. చట్టం ఉన్నప్పటికీ, న్యాయ వ్యవస్థ జోక్యం ఉన్నప్పటికీ నేటికీ ఫిరాయింపులు ఆగడం లేదు. అయితే ఫిరాయింపుల చట్టంలో వాదిగా, ప్రతివాదిగా ఎక్కువసార్లు నిలిచింది మాత్రం కాంగ్రెస్ పార్టీయే. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మరోసారి కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. అంతేకాకుండా సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లొసుగులను సవరించాలి. సభాధ్యక్షులు ఫిరాయింపుల అనర్హత ఫిర్యాదుపై మూడు నెలల్లోనే తీర్పు చెప్పాలని, లేనిపక్షంలో నిర్ణయించే అధికారాన్ని సభాధ్యక్షులకు కాకుండా స్వతంత్ర ట్రిబ్యునల్‌కు బదిలీ చేసే విధంగా సవరణలు చేయాల్సిన గురుతర బాధ్యత కేంద్రంపై ఉన్నది. ఈ చట్టాన్ని సవరణ చేసి అమలులోకి తెచ్చే విధంగా కేంద్రంపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో వారిచ్చింది డొల్ల హామీలేనని ప్రజలు అర్థం చేసుకోవాల్సి వస్తుంది.

> పదేండ్లు అధికారాన్ని అనుభవించి, బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే అధికార పార్టీలో చేరుతున్న నాయకులను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. కష్టకాలంలో అండగా ఉండాల్సిన నాయకులు స్వార్థంతో పార్టీ మారడం గర్హనీయం. కాంగ్రెస్ చెంత చేరిన బీఆర్ఎస్ శాసనసభ్యులను, శాసనమండలి సభ్యులను అనర్హులుగా ప్రకటించాల్సిన అవసరం ఉన్నది. వారి సభ్యత్వాలను రద్దు చేయడమే కాకుండా, భవిష్యత్తులో వారు పోటీచేసే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలి.